క్లుప్తంగా

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

గంగవరం: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆపద సమయంలో ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) అధ్యక్షుడు డాక్టర్ యుగంధర్, వైస్ ప్రెసిడెంట్ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు రక్తదానం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం దాదాపు 30 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఇతరులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీసుధ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

లఘు వైష్ణవీదేవి అలంకరణలో అమ్మవారు



చౌడేపల్లె: మండలంలోని పుదిపట్ల సమీపంలో వెలసిన వైష్ణవీదేవి ఆలయంలో నిర్వహిస్తున్న వారాహి నవరాత్రుల్లో భాగంగా బుధవారం అమ్మవారిని లఘు వైష్ణవి దేవి అలంకరణలో కొలువుతీర్చారు. అర్చకురాలు శ్రావణిరెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారిని అత్యంత సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సౌందర్య లహరి పారాయణం చేశారు.

అమ్మవారి సేవలో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ



చౌడేపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీబోయకొండ గంగమ్మను బుధవారం పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం అమ్మవారి శాసన వస్త్రాలు కప్పి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వేదపండితులు ఆశీర్వచనం చేశారు. ఆయన వెంట నాయకులు బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి తదితరులు వున్నారు.

స్కూల్ బస్సు సీజ్



పుంగనూరు(చౌడేపల్లె): ప్రైవేట్ బస్సులు కండీషన్‌లో ఉండాలని ఎంవీఐ సుప్రియ తెలిపారు. ఆమె బుధవారం పుంగనూరు పట్టణంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఆమె మాట్లాడుతూ పర్మిట్, ట్యాక్స్ పర్మిషన్లు లేని కర్ణాటక రిజిస్ట్రేషన్ కలిగిన బస్సును సీజ్ చేశామన్నారు. పట్టణంలోని పాఠశాలల యజమానులు తమ స్కూల్ బస్సులకు 5 సంవత్సరాలు డ్రైవింగ్ అనుభవం కలిగిన డ్రైవర్లను నియమించుకోవాలని సూచించారు. పరిమితికి మించి పిల్లలను ఎక్కించుకోవద్దని సూచించారు. పట్టణంలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, పిల్లలు రోడ్డు దాటే సమయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

రోగులకు పండ్ల పంపిణీ



పుత్తూరు: అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం (ఏఐఐఈఏ) ఆవిర్భావ వారోత్సవాల్లో భాగంగా ఆ సంఘం నాయకులు బుధవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. యూనియన్ కార్యదర్శి ఎస్.లక్ష్మణకుమార్ మాట్లాడుతూ ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం స్థానిక ఎల్ఐసీ బ్రాంచి కార్యాలయ ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు దస్తగిరి, నాయకులు మహావాణి, రాజేశ్వరి, అంజనేయులు, రాజేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.


సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ప్రారంభం

వి.కోట: పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి బుధవారం కొంగాటం పంచాయితీ పడిగలకుప్పంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావ్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే ఏఎస్.మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

అనధికారిక చీటీలు..
కోట్లలో ఐపీలు

కొందరు డబ్బు సంపాదనే ధ్యేయంగా పలు మోసాలకు పాల్పడుతున్నారు. ఇందులో భాగంగా చీటీలు నిర్వహిస్తూ రూ.కోట్లకు ఐపీలు పెడుతున్నారు. ఇప్పటికే కొందరు అనధికారికంగా చీటీలు నిర్వహించి ఆపై డబ్బులు కట్టలేక తెలివిగా వారి ఆస్తులు విక్రయించుకుని ఆపై ఐపీ పెట్టి దర్జాగా జనం మధ్యనే తిరుగుతున్నారు. ఇలా రూ.50 కోట్ల వరకు ఐపీ పెట్టారు. తాజాగా గంగవరం మండలంలోని ఒక యువ ప్రజాప్రతినిధి చీటీలు నిర్వహిస్తూ రూ.5 కోట్లకు ఐపీ పెట్టేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్టు సమాచారం.

- ఇప్పటికే పలువురు చీటీ నిర్వాహకుల ఐపీ
- త్వరలో రూ.5 కోట్లకు ఐపీకి సిద్ధమవుతున్న కీలక వ్యక్తి
- ఆత్మహత్య చేసుకుంటున్న బాధితులు



పలమనేరు: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో 300 మంది వరకు అనధికారిక చీటీలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు రూ.లక్ష నుంచి రూ.50 లక్షల వరకు వారం, నెలవారీ చీటీలు సాగుతున్నాయి. చీటీల నిర్వాహకుల్లో ఎక్కువ మంది రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు వున్నారు. వీరు సమాజంలో కాస్త మంచి పేరు తెచ్చుకోవడం ఆపై ఉన్న ఆస్తులను చూపుతూ ధనవంతులుగా చలామణి అవుతూ చీటీలు నిర్వహిస్తున్నారు. ఈ చీటీల్లో 20 మంది నుంచి 50 మంది సభ్యులు ఉంటున్నారు. తొలుత రెండు, మూడు చీటీలను సజావుగా నిర్వహించి ఆపై మోసాలు చేస్తున్నారు. చీటీల నిర్వాహకుల మాయమాటలు నమ్మి చీటీలు వేసిన బాధితులు మళ్లీ డబ్బు వసూలు చేసుకోలేకపోతున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేద్దామంటే అనధికారిక చీటీలు ఎవరు వేయమన్నారనే ప్రశ్న వారి నుంచే వస్తోంది. దీంతో డబ్బులు పోగొట్టుకున్న బాధితులు పోలీసులను ఆశ్రయించలేక, పోయిన డబ్బును తిరిగి పొందలేక అప్పుల పాలు అవుతున్నారు.

ఏమీ చేయలేక ఆత్మహత్యలు సైతం

చీటీలు వేసి మోసపోయిన కొందరు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ఒక ఉపాధ్యాయుడు అప్పులపాలై ఇటీవలే ఆత్మహత్య చేసుకున్నాడు. మరో వ్యక్తి ఎటో వెళ్లిపోయాడు. పలమనేరు మండలంలోని తొప్పనపల్లిలోనే రూ.10 కోట్ల దాకా చీటీల్లో మోసాలు సాగినట్టు సమాచారం. గంగవరం మండలం చిన్నూరుకు చెందిన దంపతులు గ్రామంలో మంచిగా ఉంటూ రూ.కోట్లకు ఐపీ పెట్టారు. ఇదే మండలంలోని కొంగోళ్లపల్లికి చెందిన ఒక మహిళ రూ.36 లక్షలకు ఐపీ పెట్టింది. ఇప్పటి దాకా పది మంది వరకు చీటీల నిర్వాహకులు ఐపీలు పెట్టారు. ఈ విషయమై స్థానిక డీఎస్పీ డేరంగుల ప్రభాకర్‌ను వివరణ కోరగా అనధికారిక చీటీలు నిర్వహించరాదని తెలిపారు. అలా చీటీలు వేయవద్దని జనాలకు చెప్పినా వినడం లేదని, మోసపోయాక పోలీసుల వద్దకు వచ్చి బాధపడితే లాభం లేదన్నారు. బాధితులు వారి వద్ద ష్యూరిటీ ఉంటే కోర్టును ఆశ్రయించవచ్చని తెలిపారు.



తెలివిగా ఐపీలు పెడుతున్న నిర్వాహకులు

చీటీల నిర్వాహకులు చాలా తెలివిగా ఐపీలు పెడుతున్నారు. ఈ మధ్య కాలంలో పది మంది వరకు ఇలా ఐపీలు పెట్టారు. వారిలో నలుగురు దర్జాగా తిరుగుతున్నారు. గంగవరం మండలానికి చెందిన ఒక యువ ప్రజాప్రతినిధి సైతం పలమనేరు పట్టణంలో చిట్స్ ఆఫీసును ప్రారంభించి పలువురు నుంచి రూ.5 కోట్ల వరకు చీటీలను నడిపిస్తూ అందరికీ మోసం చేసినట్టు సమాచారం. కొన్నాళ్లుగా కార్యాలయం సైతం తెరుచుకోకపోవడంతో సభ్యులు ఆందోళన చెందుతున్నారు. చీటీలు పాడుకుని ష్యూరిటీగా చెక్కులు, బాండ్లు ఇచ్చిన వారు ఆందోళన చెందుతున్నారు.

సదుమమ్మ సేవలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి



అమ్మవారి సేవలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి దంపతులు

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లెలో వున్న సదుమమ్మ ఆలయాన్ని బుధవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. వారికి అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేని పలువురు కలిసి తమ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని ఆయన వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మాజీ ఎంపీపీ ఇందిరమ్మ, పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్ రెడ్డి, పెద్దిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ ధనుంజయ రెడ్డి, ఎంపీటీసీ శ్రీలత, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్ప రెడ్డి, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కిండర్ కేర్ స్కూల్ అడ్మిషన్లు

పలమనేరు: పట్టణంలోని కిండర్ కేర్ మానసిక వికలాంగ పిల్లల బడిలో శుక్రవారం నుంచి అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ అవకాశాన్ని 6 నుంచి 9 ఏళ్లలోపు శారీరక, మానసిక వికలాంగ పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం 8897506631 ను సంప్రదించాలని తెలిపారు.

కూటమి మోసాలను జనంలోకి తీసుకెళ్దాం





మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు భూమన, నాయకులు

- కూటమి హామీలు రూ.75 వేల కోట్లు.. ఇచ్చింది రూ.7 వేల కోట్లు
- రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో నినాదంతో ముందుకెళ్దాం
- బాబు ష్యూరిటీ.. మోసానికి గ్యారెంటీగా మారింది
- హామీలపై అడిగితే నాలుక మందమట
- వైఎస్సార్ సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి



కార్యక్రమానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

పలమనేరు/గంగవరం: కూటమి అధికారంలోకి వచ్చిన ఈ ఏడాదిలో వారు ఇచ్చిన హామీల మేరకు ప్రజలకు 68 వేల కోట్లను ఇవ్వకుండా మోసం చేశారని ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కరుణాకరరెడ్డి పేర్కొన్నారు. పలమనేరు పట్టణ సమీపంలోని ఓ ప్రైవేటు హాలులో బుధవారం మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ అధ్యక్షతన బుధవారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భూమన కరుణాకరరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ పాలనకు.. నేటి ఏడాది కూటమి పాలనకు ఉన్న తేడా, నాడు అందిన పథకాలు, ఇప్పుడు జరిగిన మోసాన్ని ప్రతి ఇంటికీ వెళ్లి క్యూఆర్ కోడ్‌ను వారితో స్కాన్ చేయించి వివరించాలని సూచించారు. కూటమి హామీల్లో భాగంగా గ్యాస్, ఉచిత బస్సు కాకుండా మిగిలిన పథకాలకు ఈ ఏడాది రూ.75 వేల కోట్లు ఇవ్వాల్సి ఉండగా వారు రూ.7 వేల కోట్లు మాత్రమే ఇచ్చారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ కంటే ఎక్కువగా పథకాలిస్తామని ఎన్నికల్లో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ జనానికి హామీలిచ్చి మోసం చేశారని విమర్శించారు. అందుకే రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో పేరిట ప్రతి ఇంటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం జరిగిన మేలు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన మేలును వివరించాలన్నారు. పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన మోసాన్ని ప్రజలకు తెలిపేందుకు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ఇంటింటికీ తీసుకెళ్లాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. సూపర్‌సిక్స్ హామీలను అమలు చేశామని సీఎం చంద్రబాబు నిస్సిగ్గుగా చెప్పడం.. ప్రశ్నించిన వారికి నాలుక మందమని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. నాయకులు గణేష్‌యాదవ్, వైఎస్సార్ సీపీ రిటైర్డ్ ఎంప్లాయిస్ నేత సోమచంద్రారెడ్డి, మండల కన్వీనర్ హేమంత్ కుమార్‌రెడ్డి, చెంగారెడ్డి, రహీంఖాన్ తదితరులు కూటమి పాలనలో భ్రష్టుపట్టిన విద్య, వైద్య రంగాల గురించి విపులంగా వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు బాగారెడ్డి, కేశవులు, భాస్కర్‌రెడ్డి, యువరాజ్, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, అనుబంధ విభాగాలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇబ్బంది పడుతున్న టీచర్లు

చంద్రబాబు అధికారంలోకి రావాలనుకున్న ఉపాధ్యాయులు సైతం కూటమి ఏడాది పాలనలోనే ఎంతో బాధపడుతున్నారని మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేసిన నేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, పోలీసులు కీలుబొమ్మలుగా మారారని దుయ్యబట్టారు. తనకు ఓటు వేయకున్నప్పటికీ అర్హులైతే ప్రభుత్వ పథకాలు ఇవ్వాలని నాడు జగనన్న చెబితే.. నేడు మన వాళ్లకు మాత్రమే పథకాలు ఇవ్వాలని సీఎం స్థాయిలో చంద్రబాబు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కోటి మంది నిరుద్యోగులకు భృతి ఏమైందని సోషల్ మీడియాలో ప్రశ్నించిన వారి ఇంటికి పోలీసులు వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి మాట్లాడుతూ కూటమి పాలనలో ప్రజలకు జరిగిన మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మనమంతా సైనికుల్లా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.

వైఎస్ జగన్‌ను కలిసిన నేతలు

- పార్టీలో యువతపాత్ర కీలకం
- కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్



మాజీ సీఎం వైఎస్.జగన్‌తో హేమంత్‌రెడ్డి, ఆర్‌వీఎస్ నాయుడు

పుంగనూరు(చౌడేపల్లె): వైఎస్సార్ సీపీలో యువజన విభాగం పాత్ర కీలకమని మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం వైఎస్సార్ సీపీ యువజన విభాగం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఇందులో యువజన విభాగం రాయలసీమ రీజనల్ కోఆర్డినేటర్ హేమంత్‌రెడ్డి, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు ఆర్‌వీఎస్ నాయుడు పాల్గొన్నారు. అనంతరం వారు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి చిత్తూరు జిల్లాలో యువజన విభాగం ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. యువత పోరు కార్యక్రమం విజయవంతం చేసినందుకు వైఎస్.జగన్ ప్రత్యేకంగా అభినందించారు. హేమంత్‌రెడ్డి జిల్లాలోని యువజన విభాగం రాష్ట్ర కమిటీ సభ్యులు, నియోజకవర్గ అధ్యక్షులను వైఎస్.జగన్‌కు పరిచయం చేశారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ యువజన విభాగం కార్యాచరణలో ఇది ఆరంభం అని, తరువాత జిల్లాల పర్యటన, పాదయాత్ర ఉంటుందని తెలిపారు. యువజన విభాగం పటిష్టంగా ఉంటే పార్టీ మరింత బలపడుతుందన్నారు. గ్రామ, మండల స్థాయి నుంచి యువజన విభాగం కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. యువకులు ఎప్పటికప్పుడు ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ, హామీలను ఎగ్గొట్టే విధానాలను ఎండగడుతూ ఈ కూటమి ప్రభుత్వాన్ని నిద్ర లేపాలన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కిషోర్, భాగ్యరాజు, చెంగారెడ్డి, దొరబాబు, నియోజకవర్గ అధ్యక్షుడు డీసీ మనోజ్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, కిషోర్‌రెడ్డి, తేజ, హేమకృష్ణ, అలాగే పలమనేరుకు చెందిన రాష్ట్ర నాయకుడు మొగసాల కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

19వ రోజూ మున్సిపల్ కార్మికుల నిరసన



కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న ఫ్రూట్ యూనియన్ నేతలు అఫ్సర్, చందు, లియాఖత్‌అలీ

పుంగనూరు(చౌడేపల్లె): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపాలిటీలోని పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు చేపట్టిన నిరసన బుధవారం 19వ రోజుకు చేరింది. వారికి ఫ్రూట్ యూనియన్ నాయకులు అఫ్సర్, చందు, లియాఖత్ అలీ సంఘీభావం తెలిపారు. ఆ సంఘం అధ్యక్షుడు శ్రీరాములు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తోందని మండిపడ్డారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, జీవో నంబరు 36ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగ భద్రత కల్పించాలని, చనిపోయిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. రిస్క్, హెల్త్ అలవెన్స్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మిక యూనియన్ నాయకులు బక్షు, షబాజ్, సదం, జబ్బీర్, బుద్దు, మహావాలి, అన్వర్, కార్మికులు కుమార్, గోపి, దౌలత్, సంతోష్, శివకుమార్, మోహన్, సోము, వెంకట్రమణ, యూసుఫ్, జావహర్‌అలి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ దయానందరాజు, పక్కన అయూబ్‌ఖాన్

పుంగనూరు(చౌడేపల్లె): పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు బుధవారం డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం హెల్త్, ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు బహుమతులు ప్రదానం చేశారు. పట్టణంలోని ఎన్ఎస్.పేటలో వున్న బసవరాజ బాలుర జూనియర్ కళాశాలలో బుధవారం ట్రస్ట్ ఫౌండర్ అయూబ్‌ఖాన్ ఆధ్వర్యంలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ దయానందరాజు మాట్లాడుతూ 2025లో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ట్రస్ట్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతిభావంతులైన గ్రామీణ విద్యార్థులను ప్రోత్సహించడమే ఈ ట్రస్ట్ లక్ష్యమన్నారు. విద్యార్థులు మంచి కలలు కనాలని, వాటిని సహకారం చేసుకునేందుకు అబ్దుల్ కలామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు నగేష్, బ్రహ్మతేజ, బి.చైత్ర, తేజోనిధి, భావన, రెడ్డిప్రసన్న, శిల్పను శాలువాతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్‌నాయుడు, అధ్యాపకులు మురళీ, డాక్టర్ నాగేనాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు వి.కోట పర్యటన


- ఎమ్మెల్యేకు అవమానం



సీఎం పర్యటనలో ఎమ్మెల్యేని నెట్టుతున్న రక్షణ సిబ్బంది

వి.కోట: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం కుప్పం పర్యటనలో భాగంగా బెంగళూరు–చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే నుంచి వి.కోట మీదుగా వెళ్లారు. ఆయన వి.కోటలోని వైఎస్సార్ సర్కిల్‌లో ఐదు నిమిషాలు ఆగి ప్రజలకు అభివాదం చేశారు. పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి సీఎంను కలిసేందుకు కాన్వాయ్ వద్దకు వెళ్తుండగా రక్షణ సిబ్బంది పక్కకు నెట్టేశారు. గమనించిన సీఎం స్థానిక ఎమ్మెల్యే అని చెప్పడంతో సీఎం కాన్వాయ్ వద్దకు అనుమతించారు. ఎమ్మెల్యే అమరన్నకు తీవ్ర అవమానం జరిగిందని వి.కోట ప్రజలు మాట్లాడుకుంటున్నారు.

యువకుడిపై దాడి



పుంగనూరు (చౌడేపల్లె): మండలంలోని షుగర్ ఫ్యాక్టరీ వద్ద బుధవారం పాతకక్షలతో యువకుడిపై దాడి చేశారు. స్థానికుల కథనం మేరకు.. పుంగనూరులోని సూర్యనగర్‌లో వుంటున్న రత్నారెడ్డి కుమారుడు మహేంద్రరెడ్డి (28) తన స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడేందుకు షుగర్ ఫ్యాక్టరీ వద్దకు వెళ్లాడు. అక్కడ నివాసం ఉంటున్న మోహన్, సుదర్శన్ పాత కక్షలను మనసులో పెట్టుకుని మహేంద్రరెడ్డిపై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన అతన్ని కుటుంబ సభ్యులు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బడికి దారి చూపితేనే పంపుతాం

– పిల్లల తల్లిదండ్రుల స్పష్టీకరణ



బండకిందపల్లెలో నేషనల్ హైవే సూపర్‌వైజర్‌తో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల: దారి చూపితేనే పిల్లలను బడికి పంపుతామని, లేకుంటే ఇంటి వద్దే ఉంచుకుంటామని విద్యార్థుల తల్లిదండ్రులు తెగేసి చెప్పారు. మండలంలోని బండకిందపల్లె పాఠశాలకు విద్యార్థులు బుధవారం కూడా హాజరుకాలేదు. ఉపాధ్యాయులు తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ఎంత చెప్పినా ఫలితం లేదు. ఈ విషయాన్ని కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు టీడీపీ నేత చల్లా రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన అక్కడికి చేరుకుని పరిశీలించారు. బండకిందపల్లె పాఠశాలలో 54 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. వీరిలో 40 మంది నేషనల్ హైవే దాటుకుని రావాల్సి ఉందన్నారు. బడికి దారి లేకపోవడంతో 40 మంది విద్యార్థులను తల్లిదండ్రులు బడికి పంపడం లేదని తెలిపారు. వారికి మద్దతుగా మిగిలిన 14 మంది విద్యార్థులు కూడా బడికి హాజరుకావడం లేదని చెప్పారు. బడికి విద్యార్థులు వచ్చేందుకు తాత్కాలికంగా దారి వేస్తామని నేషనల్ హైవే వారు చెప్పినా తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. శాశ్వతంగా బడికి దారి చూపితేనే బడికి పిల్లలను పంపుతామని చెప్పడంతో చల్లా రామచంద్రారెడ్డి నేషనల్ హైవే సూపర్‌వైజర్‌తో మాట్లాడి 150 మీటర్ల దూరం రోడ్డు వేసి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చేయాలని సూచించారు. దీనికి నేషనల్ హైవే వారు రోడ్డు వేసేందుకు అంగీకరించారు. విద్యార్థులు గురువారం కూడా పాఠశాలకు వస్తారో లేదో వేచి చూడాలి.

సామాజిక బాధ్యతపై అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

పుంగనూరు(చౌడేపల్లె): విద్యార్థులు సామాజిక బాధ్యత కలిగి ఉండాలని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస్ తెలిపారు. ఆయన బుధవారం విద్యార్థులకు సామాజిక బాధ్యతపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో మార్పు, మన మనస్సులో మార్పుతో సామాజిక బాధ్యతపై అవగాహన మొదలవుతుందన్నారు. విద్యార్థులు మంచి పౌరులుగా మారాలంటే ముందుగా తమ ఆలోచనలు, ప్రవర్తన మార్చుకోవాలని సూచించారు. నేటి యువత సినిమాలు, క్రికెట్, హీరోలపై అభిమానాన్ని పెంచుకుని కుటుంబం, విద్య, వ్యక్తిత్వ వికాసం లాంటి విషయాలను విస్మరిస్తున్నారని పేర్కొన్నారు. లైఫ్ సేవింగ్ టెక్నిక్స్‌పై అవగాహన కలిగి ఉండడం సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. ఒత్తిడితో కూడిన జీవన విధానం, శారీరక శ్రమ లేకపోవడం, ఆహారపు అలవాట్లలో మార్పుల కారణంగా గుండెపోట్లు పెరిగాయన్నారు. ఉజ్వల భవిష్యత్తు కలిగిన యువత ఉన్నట్టుండి ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో అనీల్, సోమరాజు, పవిత్ర, విద్యార్థులు పాల్గొన్నారు.